క్లుప్తంగా

వక్ఫ్ బోర్డ్ కమిటీ సభ్యుడికి సన్మానం



అయిజ: జిల్లా వక్ఫ్ బోర్డ్ కమిటీ సభ్యుడిగా ఎంపికైన పట్టణానికి చెందిన జమాలుద్దీన్‌ను బీఆర్‌ఎస్ నాయకులు శనివారం పట్టణంలో శాలువలు, పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చిన్న దేవన్న, సింగిల్‌విండో అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, సుమలత తదితరులు పాల్గొన్నారు.

ఎలక్ట్రిక్ బెల్ వితరణ

అయిజ: పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలకు శనివారం వ్యాపారి ఉత్తమ్ ఆయన కూతురు డింపల్ పుట్టిన రోజు సందర్భంగా పాఠశాలకు ఎలక్ట్రిక్ బెల్‌ను వితరణ చేశారు. విద్యార్థులకు పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ధరూరు: మండలంలోని భీంపురం చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు మేకల సుధాకర్‌రెడ్డి(50) అనారోగ్యంతో శనివారం ఉదయం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి గ్రామానికి చేరుకుని బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఎమ్మెల్యే వెంట మండల వైస్ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, రమేష్ నాయుడు, రాజారెడ్డి, వెంకటేష్ నాయుడు, జాకీర్, వంశీ, కృష్ణ తదితరులు ఉన్నారు.

వ్యాధి నిరోధక టీకాలు



అలంపూర్ రూరల్: మండలంలోని క్యాతూర్ పీహెచ్‌సీ పరిధిలోని 9 సబ్‌సెంటర్లలో శనివారం చిన్నారులకు, గర్భిణులకు వ్యాధి నిరోధక టీకాలను వైద్య సిబ్బంది ఇచ్చారు. కోనేరు, బుక్కాపూర్ జిల్లెలపాడ్‌లో కార్యక్రమాలను నిర్వహించారు.

పౌష్టికాహారంపై అవగాహన



అలంపూర్ రూరల్: మండలంలోని భీమవరంలో శనివారం పౌష్టికాహారంపై క్యాతూర్ పీహెచ్‌సీ వైద్యా సిబ్బంది, ఏఎన్‌ఎం హైమావతి అవగాహన కల్పించారు. గర్భిణులు తీసుకోవాల్సిన ఆహారంపై వివరించారు. అదేవిధంగా జాగ్రత్తలపై సూచనలు, సలహాలు ఇచ్చారు.

పాఠశాలకు ప్రహరీ నిర్మించండి

ఉండవెల్లి: మండలంలోని చిన్న ఆముదాల పాడు ప్రాథమిక పాఠశాలకు ప్రహరీ కరువైంది. పాఠశాల చుట్టూ పందులు, పశువులు వస్తున్నాయని విద్యార్థుల తల్లితండ్రులు తెలుపుతున్నారు. అధికారులు స్పందించి ప్రహరీ నిర్మించాలని కోరారు.

బూత్ కమిటీల పరిశీలన

ధరూరు: బీజేపీ ఆధ్వర్యంలో మండలంలోని ఆయా గ్రామాల్లో బూత్ కమిటీల ఏర్పాటు కొనసాగుతోంది. శనివారం మండల కేంద్రంలో బూత్ కమిటీలు, పన్నా ప్రముఖ్ కమిటీలను ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గద్దం కృష్ణారెడ్డి హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో వెంకటేశ్వరరెడ్డి, కురువ కిష్టన్న, సవారన్న, రామిరెడ్డి, లక్ష్మన్న, రామన్న, రాజు, నర్సింహులు పాల్గొన్నారు.

బీజేపీకి అవకాశం ఇవ్వండి

ఎర్రవల్లిచౌరస్తా: రాష్ట్రంలో మెరుగైన అభివృద్ధి చేయడం కోసం బీజేపీకి అవకాశం ఇవ్వాలని పార్టీ ఎడ్యుకేషనల్ సెల్ కన్వీనర్ బంగి లక్ష్మణ్ అన్నారు. ఇటిక్యాల మండలంలోని వేములలో శనివారం మండలాధ్యక్షుడు జగదీష్‌రెడ్డి ఆధ్వర్యంలో 32, 33వ పోలింగ్ బూత్ కమిటీలను ఎన్నుకున్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత



కేటీదొడ్డి: అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు శనివారం పట్టుకున్నారు. ఎస్‌ఐ వెంకటేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని వాగు నుంచి నందిన్నెకు ఇసుకను ట్రాక్టర్‌లో అక్రమంగా తరలిస్తున్నాడు. తెల్లవారుజామున 5 గంటల సమయంలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సమయంలో నందిన్నె శివారులో ఇసుక ట్రాక్టర్ రాగా సిబ్బంది సమాచారం మేరకు ట్రాక్టర్‌ను పట్టుకోగా ట్రాక్టర్‌ను వదిలి డ్రైవర్ పరారయ్యాడని ఎస్‌ఐ తెలిపారు. ట్రాక్టర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

బ్రహ్మోత్సవాలకు ముస్తాబు

- 24 నుంచి పెద్దచింతరేవుల ఆంజనేయస్వామి జాతర
- 26న రథోత్సవం, 31న ముగింపు



స్వామి వారి రథానికి రంగులు వేస్తున్న సిబ్బంది



బ్రహ్మోత్సవాలకు ముస్తాబైన ఆంజనేయ స్వామి ఆలయం



ఆంజనేయస్వామి వారి మూల విగ్రహం

ధరూరు: మండలంలోని పెద్ద చింతరేవుల ఆంజనేయ స్వామి ఆలయం బ్రహ్మోత్సవాలకు ముస్తాబవుతుంది. ఈ నెల 24 నుంచి ప్రారంభం కానున్న ఈ బ్రహ్మోత్సవాలకు ఇప్పటికే ఏర్పాట్లను ప్రారంభించారు. వారం రోజుల పాటు ఘనంగా నిర్వహించేందుకు అందుకు తగ్గ ఏర్పాట్లు చేస్తున్నారు. కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా విరాజిల్లుతున్న అంజన్న బ్రహ్మోత్సవాలకు జిల్లా నలుమూలలతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారు. మంగళవారం నుంచి ఆలయానికి రంగులు వేసే పనులు ప్రారంభమయ్యాయి. స్వామి వారి రథాన్ని ప్రత్యేకంగా అలంకరిస్తున్నారు.

ఉత్సవ కార్యక్రమాలు

మాఘ శుద్ధ తదియలు 24న అంకురార్పణ, ధ్వజారోహణము కార్యక్రమాలతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. 25న బుధవారం ఉపనయనము, తెప్పోత్సవం, పల్లకీసేవ, ప్రభోత్సవం, 26న రాత్రి 10 గంటలకు రథోత్సవము, 27న ప్రభోత్సవము, 28న అవభృత స్నానము, 29న భీష్మాష్టమి, 30న మధ్వ నవమి, 31న పల్లకీ సేవ, స్వస్తి వచనము కార్యక్రమాలతో బ్రహ్మోత్సవాలు ముగయనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

కుట్ర చేస్తున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వం



కొర్విపాడులో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న బీఎస్పీ నాయకులు

మానవపాడు: బీఆర్‌ఎస్ హాయంలో బీసీ సామాజిక వర్గ ప్రజల ఆర్థికస్థిగతులు రోజురోజుకు దిగజారుతున్నాయని బహుజన సమాజ్ పార్టీ నాయకులు అన్నారు. శనివారం మండలంలోని బీఎస్పీ శ్రేణులతో కలిసి కొర్విపాడులో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రస్తుత ప్రభుత్వం బీసీలపై కుట్రలు చేస్తోందని తెలిపారు. 9ఏళ్లలో బీసీ కార్పొరేషన్ కింద రూ.2,139కోట్లను ప్రభుత్వం కేటాయించిందని, 2014–15 నుంచి 2018–19 రూ.440 కోట్లను మాత్రమే విడుదల చేసి, రూ.230 కోట్లను ఖర్చు చేసిందన్నారు. 2019–20 సంవత్సరంలో ఒక్కపైసా కూడా ఖర్చు చేయలేదన్నారు. 2018 ఎన్నికలకు ముందు రాష్ట్ర వ్యాప్తంగా బీసీ కార్పొరేషన్ కింద 9 లక్షల మంది లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోగా కేవలం 40వేల మంది లబ్ధిదారులకు ఒక్కొక్కరికి రూ. 50వేల చొప్పున నగదును విడుదల చేసిందన్నారు. నేటికి బీసీల ఆర్థికస్థిగతులు దిగజారుతున్న పాలక ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. ఎన్నికలు ఉన్నప్పుడే ప్రజలు గుర్తుకువస్తారని తెలిపారు. కార్యక్రమంలో రాంబాబు, నాగన్న, వీరేందర్, కురుమన్న తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీ యాత్రను విజయవంతం చేయాలి

ఎర్రవల్లిచౌరస్తా: బీఎస్పీ ఆధ్వర్యంలో చేపట్టే బహుజన రాజ్యాధికార యాత్రను విజయవంతం చేయాలని నాయకుడు రాంబాబు అన్నారు. శనివారం ఇటిక్యాల మండలంలోని ధర్మవరం, బీచుపల్లిలో పర్యటించారు. ఆయా గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆర్.ఎస్ ప్రవీణ్‌కుమార్ అలంపూర్ నియోజకవర్గంలో చేపట్టే యాత్రలో ఆయా గ్రామాల ప్రజలు తమ సమస్యలను తెలిపి యాత్రను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు



బహుమతులు అందజేస్తున్న బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి రాజగోపాల్

శాంతినగర్: ఎగ్జామ్ వారియర్ ఆర్ట్ కాంపిటీషన్‌లో భాగంగా విద్యార్థులకు చిత్రలేఖన పోటీలను శాంతినగర్ జెడ్పీ ఉన్నతపాఠశాలలో విద్యార్థులకు శనివారం నిర్వహించారు. ప్రతిభ కనబరచిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ, ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ అధికార ప్రతినిధి రాజగోపాల్, నరసింహులు, అయ్యరాజు, బాబు పాల్గొన్నారు.

దోపిడీ లేని సమాజమే లెనిన్ లక్ష్యం



నివాళి అర్పిస్తున్న సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా నాయకులు

గద్వాల అర్బన్: దోపిడీ లేని సమాజ నిర్మాణమే లెనిన్ లక్ష్యమని సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా జిల్లా కార్యదర్శి కృష్ణ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో లెనిన్ 99వ వర్ధంతిని పురస్కరించుకొని చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా కోశాధికారి కార్తీక్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు హలీమ్‌పాష, జమ్మన్న, శాంతన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదభరితంగా కుర్తిరావులచెర్వు కల్వర్టు



దెబ్బతిన్న కల్వర్టు

మల్దకల్: మండలంలోని కుర్తిరావులచెర్వు – మల్దకల్ మధ్య ఉన్న కల్వర్టు రక్షణ గోడ కూలి ప్రమాదభరితంగా మారింది. ర్యాలంపాడు రిజర్వాయర్ నుంచి నాగర్‌దొడ్డి రిజర్వాయర్‌కు వెళ్లే ప్రధాన కాల్వపై ఏర్పాటు చేసిన కల్వర్టు కొద్ది రోజుల క్రితం కూలిపోయింది. ఈ రహదారిపై నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు కొనసాగిస్తుంటారని, ఎప్పుడు ఏ ప్రమాదం చోటు చేసుకుంటుందోనని వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. ఈ విషయమై నీటి పారుదల శాఖ అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరమ్మతు చేపట్టి సమస్యను పరిష్కరించాలని వాహనదారులు కోరుతున్నారు.

ఆలయాల్లో అమవాస్య పూజలు



పెద్ద చింతరేవులలో క్యూలో నిల్చున్న భక్తులు



కేటీదొడ్డిలో పూజలు చేస్తున్న భక్తులు



డి.బూడిదపాడు ఆలయంలో స్వామి వారి అలంకరణ



మల్దకల్‌లో పూజలు చేస్తున్న భక్తులు



బీచుపల్లిలో దర్శనం కోసం క్యూలైన్‌లో నిల్చున్న భక్తులు

ధరూరు: మండలంలోని ఆయా గ్రామాల్లోని ప్రధాన ఆలయాల్లో అమావాస్య పూజలు ఘనంగా నిర్వహించారు. శనివారం మండల కేంద్రంలోని ఆంజనేయ స్వామి ఆలయంతో పాటు పెద్ద చింతరేవుల ఆంజనేయ స్వామి, అల్వాలపాడు, తెలుగోనిపల్లి ఆంజనేయ స్వామి, కోతులగిద్ద అరణేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఎర్రవల్లిచౌరస్తా: బీచుపల్లి పుణ్యక్షేత్రంలోని పలు ఆలయాలు శనివారం అమావాస్యను పురస్కరించుకొని భక్తులతో రద్దీగా మారాయి. అభయాంజనేయ స్వామికి ఆలయ ప్రధాన అర్చకులు ఆకుపూజ, అభిషేకం వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఆంజనేయస్వామి ఆలయ పాలక మండలి ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టారు.

కేటీదొడ్డి: మండలంలోని వెంకటాపురం పాగుంట లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయంలోని, మండల కేంద్రంలోని శివాలయంలో శనివారం అమావాస్య పూజలు ఘనంగా నిర్వహించారు. అర్చకులు అభిషేకాలు, నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

ఉండవెల్లి: మండలంలోని డి.బూడిదపాడు ఆలయంలో అమవాస్య సందర్భంగా ఆంజనేయస్వామికి అభిషేకం నిర్వహించి, ఆకు పూజ చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని భక్తి గీతాలతో సీతారాములవారి విగ్రహాలను పల్లకీలో ఆలయం చుట్టూ ఊరేగించారు.

మల్దకల్: ఆదిశిలా క్షేత్రమైన లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తులు అమావాస్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. సద్దలోనిపల్లి కృష్ణస్వామి, పాల్వాయి అడవి ఆంజనేయస్వామి, కుర్తిరావుల చెర్వు గట్టు తిమ్మప్పస్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో వేంకటేశ్వరస్వామి మహాత్యాన్ని రమణమూర్తి భక్తులకు హరికథ రూపంలో వివరించారు.

గట్టు: అమావాస్య సందర్భంగా శనివారం గండి ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. స్వామి వారికి ఉదయం పంచామృత అభిషేకం, పూలతో అలంకరించారు. మాచర్ల చెన్నకేశవస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు.

శాంతినగర్: రామాలయం, మారుతీనగర్ ఆంజనేయస్వామి ఆలయం, జూలెకల్ సమీపంలోని అభయాంజనేయస్వామి, శివాలయం, శివాపురం ఆంజనేయస్వామి ఆలయాల్లో దేవతామూర్తులకు పూజలు చేశారు. జూలెకల్ శివాలయం వద్ద భజన కార్యక్రమం చేపట్టారు. మౌని అమావాస్య కావడంతో ఆలయాలకు భక్తులు పోటెత్తారు.

కొండాపురం పాఠశాలలో నోబ్యాగ్ డే



నో బ్యాగ్ డేలో పాల్గొన్న విద్యార్థులు

కేటీదొడ్డి: మండలంలోని కొండాపురం పాఠశాలలో శనివారం నో బ్యాగ్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ హెచ్‌ఎం నర్సింహులు మాట్లాడుతూ.. పిల్లల్లో దాగి ఉన్న అంతర్గత నైపుణ్యాలను వెలికితీయడానికి నో బ్యాగ్ డే నిర్వహిస్తున్నామని తెలిపారు. విద్యార్థులు ఉల్లాసంగా, ఉత్సాహంగా, పాఠశాలకు వస్తారని మొక్కలు నాటడంతో పాటు నృత్యాలు చేయడం విద్యార్థులు సంతోషంగా గడపడం వలన మానసిక సామర్థ్యం పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమాల వలన విద్యార్థులలో సమాగ్రాభివృద్ధి పెంపొందించ వచ్చని తెలిపారు.

మొక్కల పెంపకంపై దృష్టి



అమరవాయిలో నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీఓ కృష్ణయ్య

మల్దకల్: గ్రామాలలో ఏర్పాటు చేసిన నర్సరీలలో మొక్కల పెంపకంపై నిర్వాహకులు దృష్టి సారించాలని ఎంపీడీఓ కృష్ణయ్య సూచించారు. శనివారం మండలంలోని అమరవాయి నర్సరీని సందర్శించారు. ప్రతి నర్సరీలో లక్ష్యం మేరకు మొక్కలను పెంచి హరితహారం నాటికి సిద్ధం చేయాలన్నారు. హరితహారంలో నాటిన మొక్కలకు నీరందించి వాటిని సంరక్షించాలని తెలిపారు. గతేడాది నర్సరీలలో మిగిలిపోయిన మొక్కలను పెద్ద కవర్లలోకి మార్చి పెంచాలన్నారు. ఆయన వెంట సర్పంచ్ పద్మమ్మ, కార్యదర్శి భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యం



కస్తూర్బా పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులు

- పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు
- వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి

మానవపాడు: పదో తరగతి పరీక్షా ఫలితాల్లో విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ప్రత్యేక తరగతులు ప్రారంభమయ్యాయి. ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఆరు పేపర్లు మాత్రమే నిర్వహిస్తుండటం ప్రశ్నాపత్రంలో మార్పులు చేయడంపై విద్యార్థులు ప్రత్యేకంగా దృష్టి సారించాలని ఉపాధ్యాయులు సూచిస్తున్నారు. పది జీపీఏ సాధించేందుకు విద్యార్థులు సబ్జెక్టుల వారీగా ఉపాధ్యాయులు సూచించిన అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తే లక్ష్యసాధన సులభమేనంటున్నారు. పదో తరగతి పరీక్ష ఫలితాల్లో విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించి, ఎక్కువ 10 జీపీఏలను సాధించేందుకు ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తున్నారు. నవంబర్ నుంచి ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు.

వెనుకబడిన విద్యార్థులపై దృష్టి

మండలంలోని మూడు జెడ్పీ ఉన్నత పాఠశాలలు, కస్తూర్బా పాఠశాల ఉంది. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మానవపాడులో 116, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చెన్నిపాడులో 20, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జల్లాపురంలో 70, కస్తూర్బా పాఠశాల మానవపాడులో 37, మొత్తం 243 మంది పదో తరగతి విద్యార్థులు చదువుతున్నారు. ఆయా పాఠశాలలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించిన ఉపాధ్యాయులు వారిపై ప్రత్యేక దృష్టి సారించారు. వారిలో మానోధైర్యాన్ని నింపి సలహాలు, సూచనలు చేస్తూ చదువులో ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నారు. జిల్లాలోనే ఎక్కువగా 10 జీపీఏలు సాధించి ఆదర్శ మండలంగా ముందుంచేందుకు ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు శ్రమిస్తున్నారు.

సద్వినియోగం చేసుకుంటున్నాం

పాఠశాలలో నిర్వహిస్తున్నా స్టడీ అవర్స్‌ను ఆయా సబ్జెక్టులపై కలిగిన డౌట్స్‌ను ఉపాధ్యాయులు నివృత్తి చేస్తుకుంటున్నాము. ఉపాధ్యాయుల సహకారం మరువలేనిది. ప్రతి ఉపాధ్యాయుడి సహకారంతో చదివి ఉత్తమ ఫలితాలు సాధిస్తాం.

– ఇందు, జెడ్పీహెచ్‌ఎస్ మానవపాడు

పట్టుదలతో చదువుతున్నాం

పాఠశాల్లో ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగతులను నిర్వహించి ఆయా సబ్జెక్టులలో ఉపాధ్యాయులు ప్రతి అంశంపై విద్యాభోదన అందిస్తున్నారు. ప్రతి ఒక్కరం పట్టుదలతో చదువుతున్నాం. ఉత్తమ ఫలితాలను అందించేందుకు కృషి చేస్తాం. ఉత్తమ ఫలితాలను సాధించి, పాఠశాలకు, గ్రామానికి గుర్తింపు తీసుకువస్తాం.

– శివశంకర్, విద్యార్థి, మానవపాడు

నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాలి



పదో తరగతి విద్యార్థి అన్ని సబ్జెక్టులలో ప్రశ్నలపై ఒకటికి రెండు సార్లు చదివి అవగాహన పెంచుకోవాలని శాస్త్రసాంకేతిక అంశాలపై, సామాజిక అంశాలపై, ప్రతి పాఠ్యాంశాలపై పట్టు సాధిస్తే ఎక్కడి నుంచి బిట్స్ వచ్చిన సమాధానం ఇచ్చేలా తయారవ్వాలి.

– అమరేందర్‌రెడ్డి, ఉపాధ్యాయుడు, జల్లాపురం

ఉత్తమ ఫలితాలే లక్ష్యం



జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ప్రభుత్వ విద్యాశాఖ, కలెక్టర్ ఆదేశానుసారం ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నాం. ఉదయం, సాయంత్రం ఒక సబ్జెక్టుకు ఆయా ఉపాధ్యాయులచేత విద్యార్థులకు తరగతులను నిర్వహిస్తున్నాం. విద్యాభివృద్ధికి అహర్నిశలు పాటుపడుతున్నాం. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేకంగా దృష్టి సారించి వారిని కుడా ఎక్కువ మార్కులు సాధించేలా అవగాహన కల్పిస్తున్నాం.

– విష్ణువర్ధన్, హెచ్‌ఎం, చెన్నిపాడు

చట్టాలు అందరికీ సమానం

అయిజ: చట్టాలు అందరికీ సమానమేనని, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ప్రిన్సిపల్ సివిల్ జడ్జి గంటా కవిత అన్నారు. శనివారం పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ.. చట్టం దృష్టిలో పేద, ధనిక తేడా ఉండదన్నారు. చట్టాలపై అవగాహన లేక కొందరు అనేక విధాలుగా నష్టపోతున్నారని, కోర్టులచుట్టూ తిరుగుతూ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని తెలిపారు. ప్రతి సమస్యను పరిష్కరించేందుకు కోర్టులు ఉన్నాయని, చట్టాన్ని చేతిలోకి తీసుకొని నేరస్తులు కాకుండా న్యాయస్థానంలో న్యాయం పొందాలన్నారు. పేదవారికి ఫీజు లేకుండా వాదించేందుకు, న్యాయపరమైన సలహాలు ఇవ్వడానికి జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ పనిచేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మి, న్యాయవాదులు మధుసూదన్‌బాబు, మధుకుమార్, జనార్దన్‌రెడ్డి, రవి శంకర్, సురేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.